సాక్షి
బాపట్ల
గురువారం | 23 | మార్చి | 2023



స్మృతివనం పనుల పరిశీలన

పటమట: స్వరాజ్య మైదానంలో అంబేడ్కర్ విగ్రహ నిర్మాణం, స్మృతి వనం పనులను మున్సిపల్ ప్రత్యేక కార్యదర్శి వై.శ్రీలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ బుధవారం పరిశీలించారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.7,200, గరిష్ట ధర రూ.9,200, మోడల్ ధర రూ.8,200 వరకు పలికింది.

రెండు కరోనా కేసులు



గుంటూరు మెడికల్ : జిల్లా వ్యాప్తంగా బుధవారం రెండు కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. మంగళగిరి ఎన్నారై మెడికల్ కాలేజీలోని నర్సింగ్ విద్యార్థులకు కరోనా పాజిటివ్ వచ్చింది. జిల్లాలో కరోనా మరణాలు ఎక్కడా సంభవించలేదు.

న్యూస్‌రీల్

చిరు ధాన్యాలతో చక్కటి ఆరోగ్యం

జేసీ రాజకుమారి



గుంటూరు వెస్ట్: రోజు వారి తినే ఆహారంలో చిరుధాన్యాలు జోడిస్తే చక్కని ఆరోగ్యం సమకూరుతుందని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. బుధవారం స్థానిక రెవెన్యూ కల్యాణ మండపంలో పోషణ పక్షోత్సవాల్లో భాగంగా చిరుధాన్యాల ప్రదర్శనను ఆమె పరిశీలించారు. జేసీ మాట్లాడుతూ ప్రస్తుతం కల్తీ యుగం నడుస్తోందని ఈనేపథ్యంలో మన ఆరోగ్యం కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. చక్కని ఆరోగ్యం కోసం కొంత సేపు వ్యాయామం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, ఐసీడీఎస్ పీడీ మనోరంజని, సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

విశ్వజనీన ప్రార్థన మందిరం ప్రారంభం



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం రామకృష్ణ మిషన్ ప్రాంగణంలో భగవాన్ శ్రీ రామకృష్ణ విశ్వజనీన ప్రార్థన మందిరం బుధవారం వైభవంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ఆత్మవిదానంద్‌జీ మహారాజ్, బెంగళూరు రామకృష్ణమఠం మందిరాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సంగీత విభావరిలో త్యాగరాజ, అన్నమయ్య కీర్తలను ఆలపించారు. సంధ్యాహారతి, భజనలతో కార్యక్రమం వైభవంగా ముగిసింది. హైకోర్టు న్యాయమూర్తి మోహన్‌రావును ఘనంగా సత్కరించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ నాగరాణి, రామకృష్ణ మిషన్ కార్యదర్శి హృదనంద్ మహరాజ్, సహాయ కార్యదర్శి స్వామి సేవ్యానంద జీ, రామకృష్ణ మిషన్ పాఠశాల హెచ్ఎం సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 534.00 అడుగుల వద్ద ఉంది. ఇది 176.0590 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 9,160, ఎడమకాలువకు 2,980, ఎస్ఎల్‌బీసీకి 2,000, వరదకాలువకి 320 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 14,460 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 14,460 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 812.00 అడుగుల వద్ద ఉంది. ఇది 35.4771 టీఎంసీలకు సమానం.

పులిచింతల నీటి నిల్వ



అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 44.3840 టీఎంసీలు ఉండగా ప్రాజెక్టు ఎగువ నుంచి 1200 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 2200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

ఏప్రిల్‌లో బందరు పోర్టు పనులు ప్రారంభం

మచిలీపట్నంటౌన్: బందరు పోర్టు నిర్మాణ పనులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏప్రిల్ నెలలో ప్రారంభించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. బచ్చుపేట వెంకటేశ్వరస్వామి ఆలయ కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన ఉగాది వేడుకల్లో పాల్గొన్న ఆయన ఈ మేరకు ప్రకటన చేశారు. తెలుగు సంవత్సరాదిలో జిల్లా మరింత సమగ్రాభివృద్ధి దిశగా పయనిస్తుందని చెప్పారు. పోర్టు ఏర్పాటుతో జిల్లానే కాకుండా రాష్ట్రం మరింతగా పురోగమిస్తుందని చెప్పారు. పనులు ప్రారంభించి వేగంగా జరిగేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారని వివరించారు.

10 వేల ఇళ్లు

ఏప్రిల్ మొదటి వారంలో 'జగనన్న' గృహ ప్రవేశాలు

తుదిమెరుగులు దిద్దుకుంటున్న పేదల ఇళ్లు ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి.. ఇప్పటికే జగనన్న కాలనీల్లో మౌలిక సౌకర్యాలైన తాగునీరు, విద్యుత్, మెరక, రోడ్లు, కాలువల నిర్మాణం తదితరాలన్నీ దాదాపుగా పూర్తవగా, లబ్ధిదారులు సైతం ప్రభుత్వం అందించిన ఆర్థికసాయంతో వేగంగా గృహాలు నిర్మించుకున్నారు. వచ్చే నెల మొదటివారం కల్లా జిల్లాలో పదివేల గృహాలు పూర్తి చేయడమే లక్ష్యంగా అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. – సాక్షి ప్రతినిధి, గుంటూరు



ప్రారంభానికి సిద్ధమైన గృహం

- అప్పటికి పదివేల గృహాలు పూర్తిచేయడమే లక్ష్యం
- ఇప్పటి వరకు పూర్తయిన ఇళ్లు 7,384...శ్లాబ్ దశలో 684
- జగనన్న కాలనీలో పూర్తయిన ఇళ్లకు తాగునీరు, విద్యుత్ సదుపాయం
- అయిన పనులకు వెంటనే బిల్లులు చెల్లింపు
- లక్ష్యాన్ని చేరుకుంటాం : జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి





గుంటూరు రూరల్ మండలం పొత్తూరు గ్రామం నాయుడుపేట లేఅవుట్‌లోని గృహాలు

వచ్చే నెల మొదటి వారానికి గుంటూరు జిల్లాలో పదివేల జగనన్న ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ దిశగా జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో కసరత్తు చేస్తోంది. ప్రభుత్వం జిల్లావ్యాప్తంగా పేదలకు 67,678 ఇళ్లు కేటాయించింది. తర్వాత 90 రోజుల్లో ఇళ్ల పట్టాల కింద మరో 3,190 మందికి స్థలాలను ఇచ్చిన సంగతి తెలిసిందే.

- ఇప్పటి వరకు 65,719 ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాగా, 7,384 ఇళ్లు పూర్తి చేశారు. మరో 684 ఇళ్లు శ్లాబ్ పనులు పూర్తి చేసుకున్నాయి.
- వచ్చే నెల మొదటి వారానికి పది వేల ఇళ్లు పూర్తయి గృహప్రవేశాలు చేసేలా అధికారులు ప్రయత్నాలు మొదలు పెట్టారు.
- 1565 ఇళ్లు రూఫ్‌లెవల్‌కు చేరుకోగా, బేస్‌మెంట్ లెవల్ దాటిన ఇళ్లు సుమారు 32,742 వరకూ ఉన్నాయి. మరో 32,977 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్ కన్నా తక్కువలో ఉన్నాయి.
- ముఖ్యంగా గుంటూరు చుట్టుపక్కల ఉన్న లే–అవుట్లలో ఇళ్ల నిర్మాణం కాంట్రాక్టర్లకు ఆప్షన్–3 కింద అప్పగించిన సంగతి తెలిసిందే. ఈ పనులు వేగవంతం అయ్యేలా చర్యలు చేపట్టారు.
- గుంటూరు నగరం పరిధిలో 27,318 ఇళ్లు ఉండగా, అందులో 14,850 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్ దాటాయి. ప్రధానంగా ఫిరంగిపురం మండలంలో 1076, చేబ్రోలులో 1264, తెనాలి అర్బన్‌లో 4459, తాడికొండలో 1055, కొల్లిపరలో 1224, దుగ్గిరాలలో 1048, మేడికొండూరులో 1133, తెనాలి రూరల్‌లో 1296 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్‌కి పైగా నిర్మాణంలోకి వచ్చాయి.
- పూర్తయిన ఇళ్లలో కూడా తెనాలి అర్బన్, తెనాలి రూరల్ ముందంజలో ఉన్నాయి.
- వేసవి ప్రారంభం కావడంతో ఇళ్ల నిర్మాణం వేగం పుంజుకుంటుందని అధికారులు భావిస్తున్నారు. డిసెంబర్ వరకు వర్షాలు కురవడం, తాజాగా మూడు రోజుల పాటు వర్షాలు కురవడం కూడా కొంత జాప్యానికి కారణంగా మారింది.
- ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేసరికి తాగునీరు, విద్యుత్ సదుపాయం కల్పించేందుకు చర్యలు చేపట్టారు. పూర్తయిన ఇళ్లకు ఎప్పటికప్పుడు బిల్లులు పూర్తిస్థాయిలో చెల్లిస్తున్నారు.
- జగనన్న కాలనీల లే–అవుట్లు మెరక చేయడం కోసం ఈ ఏడాది రూ.32కోట్లు చెల్లించారు. లక్ష్యాన్ని అందుకునేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో దృష్టి పెడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి 'సాక్షి ప్రతినిధి'కి తెలిపారు.

ఉగాది వేడుకల్లో ఎస్పీ దంపతులు

ఒంగోలు టౌన్: శోభకృత్ నామ సంవత్సరాది ఉగాది పండుగను పురస్కరించుకొని బుధవారం ప్రకాశం జిల్లా ఎస్పీ మలికా గర్గ్, బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ దంపతులు జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో వేంచేసి ఉన్న సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రకాశం ఎస్పీ తండ్రి, రిటైర్డ్ డీజీపీ సత్యేంద్ర గర్గ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన పంచాంగావిష్కరణ చేసి భక్తులకు పంపిణీ చేశారు. జిల్లా ప్రజలు, పోలీసు అధికారులకు, సిబ్బందికి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. శోభకృత్ నామ సంవత్సరంలో తెలుగు ప్రజలకు అన్నివిధాలా మేలు కలుగజేయాలని ఆకాంక్షించారు. ఆలయ అర్చకులు ఎం.రమణ దీక్షితులు, ఎం.దక్షిణామూర్తి, సీతారామచంద్ర స్వామి భక్తజన సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



ఉగాది పంచాంగ శ్రవణంలో ఎస్పీలు మలికాగర్గ్, వకుల్ జిందాల్ దంపతులు

ములాయం సింగ్ చిరస్మరణీయుడు

చీరాలలో ములాయం విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎంపీ బీద మస్తాన్ రావు, ఎమ్మెల్యే బలరామ కృష్ణమూర్తి

చీరాల రూరల్: ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర మాజీ మంత్రి ములాయం సింగ్ యాదవ్ కాంస్య విగ్రహాన్ని వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు ఆధ్వర్యంలో బుధవారం రాత్రి స్థానిక చిన్నమార్కెట్ సెంటర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వైఎస్సార్ సీపీ రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, స్థానిక ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ బాబులు పాల్గొని విగ్రహావిష్కరణ చేశారు. అనంతరం డాక్టర్ పాలేటి రామారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు పాల్గొని మాట్లాడారు. ఉత్తర ప్రదేశ్‌కు మూడుసార్లు ముఖ్యమంత్రిగా, కేంద్రంలో రక్షణశాఖ మంత్రిగా ములాయం సింగ్ పనిచేశారని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీలకు ఆయన చేసిన సేవలు మరులేనివని, ఆయన చిరస్మరణీయుడన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా చట్టసభలలో మహిళలకు నామినేటెడ్ పోస్టులు 50 శాతం అందించారని, ఈ మూడున్నర సంవత్సర కాలంలో నలుగురు బీసీలకు రాజ్యసభ సభ్యులుగా అవకాశం కల్పించారని, అలానే 14 మంది బీసీలకు ఎమ్మెల్సీలుగా అవకాశాలు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి మాట్లాడుతూ చీరాలలో ప్రతిఒక్కరూ కులమతాలకు తావులేకుండా సుఖ సంతోషాలతో కలసి మెలసి జీవిస్తారని చెప్పారు. మాజీ ఎంపీ చిమటా సాంబు, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్ యాదవ్, బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.



విగ్రహావిష్కరణలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే బలరామ కృష్ణమూర్తి



ములాయం సింగ్ యాదవ్ కాంస్య విగ్రహం

సంప్రదాయానికి ప్రతీక ఉగాది



దర్భశయనం శ్రీనివాసచార్యను సత్కరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సోమయాజులు, కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, గజల్ శ్రీనివాస్, తదితరులు

పాతగుంటూరు: తెలుగు సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక ఉగాది అని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.వి.ఎస్.ఎస్.సోమయాజులు అన్నారు. బుధవారం గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సాహితీ సమాఖ్య, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో సాహితీ వసంతోత్సవం నిర్వహించారు. విష్ణుసహస్రనామ పారాయణం, నాదస్వర కచేరి, వేద పఠనం, శ్రీమాన్ గుదిమెళ్ల శ్రీకూర్మనాథ స్వామి పంచాంగ పఠనం చేశారు. సభకు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా జస్టిస్ డి.వి.ఎస్.ఎస్.సోమయాజులు పాల్గొని ప్రసంగించారు. సమాజంలో సంస్కారాన్ని, పాత పద్ధతులను మరిచిపోవడం వల్ల అన్యాయాలు జరుగుతున్నాయన్నారు. ఏ జన్మలో చేసుకున్న పుణ్యమో తాను న్యాయమూర్తినయ్యానని పేర్కొన్నారు. కోవిడ్ మహమ్మారి ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న తరుణంలో మనదేశం ప్రపంచానికి వ్యాక్సిన్ అందించిందని పేర్కొన్నారు. చిన్నతనం నుంచే

జస్టిస్ డి.వి.ఎస్.ఎస్.సోమయాజులు

చట్టాలను పాటించేలా పిల్లలను ప్రోత్సహించాలన్నారు. అనంతరం సుప్రసిద్ధ రచయిత డాక్టర్ దర్భశయనం శ్రీనివాసాచార్యకు శోభకృత్ సాహితీ పురస్కారం ప్రదానం చేశారు. రచయిత, విశ్లేషకుడు డి.ఎస్.శర్మకు ఆత్మీయ సత్కారం చేశారు. కార్యక్రమాన్ని సాహితీ సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎస్.వి.ఎస్.లక్ష్మీనారాయణ, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్టు కార్యదర్శి పి.రామచంద్రరాజు పర్యవేక్షించారు. కార్యక్రమంలో సహస్రావధాని బ్రహ్మశ్రీ డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ, ఆంధ్రా సారస్వత పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్, రచయిత డాక్టర్ ఎ.వి.గురువారెడ్డి, సినీమాటల రచయిత బుర్రా సాయిమాధవ్, జానపద సాహిత్య పరిశోధకులు డాక్టర్ భాస్కర్‌యోగి, చిత్రకళ విశారథ శ్రీకూచి, రేటూరి గాయత్రి, సాహితీ సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ డి.వి.ఎస్.బి.రామమూర్తి, కార్యదర్శి ఆర్.రాము, తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ 'ఆర్థో' విభాగానికి రూ. 2 కోట్ల పరికరాలు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ ఆర్థోపెడిక్ వైద్య విభాగానికి సుమారు రూ. 2కోట్ల విలువ చేసే వైద్య పరికరాలు వచ్చాయి. ఆపరేషన్‌లలో ఖచ్చితత్వం కోసం వైద్యులు సులువుగా ఆర్థోపెడిక్ ఆపరేషన్లు చేసేందుకు అవసరమైన సీఆర్మ్ వైద్య పరికరాలు నాలుగు వచ్చాయి. ఒక్కో పరికరం ఖరీదు రూ. 20 లక్షలు. ఒక్కొటి రూ.10లక్షలు విలువైన రెండు ఆపరేషన్ టేబుల్స్, రూ.6లక్షల విలువ చేసే టార్నికిట్స్ రెండు, డ్రిల్‌సెట్స్ రెండు వచ్చాయి. ఎనిమిది నెలల క్రితం జీజీహెచ్ ఆర్థోపెడిక్ వైద్య విభాగానికి మెరుగైన ఆపరేషన్‌లు చేసేందుకు పలు వైద్య పరికరాలు కావాలంటూ ఆర్థోపెడిక్ వైద్య విభాగాధితి డాక్టర్ ఘంటా వరప్రసాద్ లిఖిత పూర్వకంగా వైద్యారోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన స్పందించి వైద్య విభాగానికి కావాల్సిన అన్నిరకాల అత్యాధునిక పరికరాలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో రెండు రోజుల క్రితం వైద్య పరికరాలు వచ్చాయి. అడిగిన వెంటనే పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించేందుకు అవసరమైన అత్యాధునిక వైద్య పరికరాలను జీజీహెచ్‌కు పంపించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శికి జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి, ఆర్థోపెడిక్ వైద్య విభాగాధిపతి డాక్టర్ ఘంటా వరప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.



ఆర్థోపెడిక్ వైద్య విభాగంలో ఉన్న పరికరాలు

షడ్రుచుల సమ్మేళనమే జీవితం

- ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- వివిధ రంగాల్లోని లబ్ధప్రతిష్టులకు పురస్కారాలు ప్రదానం


భవానీపురం(విజయవాడపశ్చిమ): ఉగాది పచ్చడి షడ్రుచుల సమ్మేళనమని, ప్రతి రుచికి ఒక అనుభూతి ఉంటుందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డ్ ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. ఆయా రుచుల అనుభూతుల సమ్మేళనమే జీవితమన్నారు. శోభకృత్ నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా మల్లాది వేంకట సుబ్బారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సంగీత, సాహిత్య, కళారంగాల్లో లబ్దప్రతిష్టులైనవారికి ఉగాది పురస్కారాలు ప్రదానం చేశారు. తొలుత విష్ణు సహస్రనామ పారాయణం, కళాకారులతో సాంస్కృతిక ప్రదర్శనలు, వేద పండితులతో వేద స్వస్తి నిర్వహించారు. అనంతరం రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ ఆస్థాన సిద్ధాంతి కప్పగంతు సుబ్బరామ సోమయాజి పంచాంగ శ్రవణం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాస్‌లు మాట్లాడారు. పద్మశ్రీ అన్నవరపు రామస్వామి, గజల్ శ్రీనివాస్, క్రోవి సార్థసారథి, పద్మశ్రీ దండమూడి సుమతీ రామమోహన్ రావు, రాణి నరసింహమూర్తి, మల్లాది సూరిబాబు, పాలపర్తి శ్యామలానందప్రసాద్, ఉపద్రష్ట వెంకటరమణమూర్తి, డాక్టర్ కప్పగంతు రామకృష్ణ, డాక్టర్ జి.ఈశ్వర్, వీవీ శివరామకృష్ణ, దామోదర గణపతిరావు, సాయి గీత, రాళ్లపల్లి నవీన్, యడవల్లి రాము, గోనుగుంట్ల యలమందరావు, భాగవతుల వెంటకరామ శర్మలకు ఉగాది పురస్కారాలు ప్రదానం చేశారు. అధికార భాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌బాబు, ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్ పి.గౌతంరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమలపూర్ణమ్మ, డెప్యూటీ మేయర్ అవుతు శైలజ రెడ్డి, మల్లాది రాజేంద్ర, వేముల హాజరత్తయ్య గుప్తా, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.



ఉగాది పురస్కారాల ప్రదానంలో మల్లాది విష్ణు, వెలంపల్లి, పూనూరు గౌతమ్ రెడ్డి

పుణ్యఫలాలనిచ్చే పవిత్ర రంజాన్

- రేపటి నుంచి ఉపవాస దీక్షలు !
- కళకళలాడుతున్న మసీదులు
- నిత్యం సత్‌కార్యాలు, ఆధ్యాత్మిక ఆరాధనలు
- రోజా పాటించేవారికి ప్రభుత్వ విధుల్లో గంట సడలింపు





వ్యాపార దుకాణం వద్ద విద్యుత్ దీపాలతో వెలిసిన చంద్రుడు

యడ్లపాడు: ముస్లింలకు ముఖ్యమైన..పవిత్రమైన.. అతిపెద్ద పండుగ రంజాన్. ఏడాది కాలంగా ఎదురుచూసే రంజాన్ ఉపవాస దీక్షల కాలం వచ్చేసింది. చాంద్రమానం అనుసరించే ఇస్లాం కేలండర్ ప్రకారం 9వ నెలలో రంజాన్ మాసం ప్రారంభం అవుతుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో శుక్రవారం నుంచి సుదీర్ఘ ఉపవాస దీక్షలను ముస్లింలు చేపడతారు. ఇస్లాం ధర్మాల్ని తు.చ.తప్పకుండా పాటించడమే రంజాన్ ఉపవాసాల ముఖ్య ఉద్దేశం. ఇది ఆచరించే వారికి ఈ మాసం ఓ శిక్షణ కాలం. ఇస్లాం ధర్మాలు ఒక్క ముస్లింలకు ఉద్దేశించబడినది కాదు సర్వమానవాళికి సంబంధించినది. మనిషి పతనానికి కారణమైన దుర్గుణాలను వీడి ఆధ్యాత్మిక మార్గాన చక్కని క్రమశిక్షణను అలవరుస్తుంది. మనిషిలో మార్పు, మనసులో దయ, ప్రేమ, కరుణ, భక్తిభావాలను పెంపొందిస్తుంది.

30 రోజుల పండుగ...

రంజాన్ ఒక్కరోజు పండుగ కాదు. నెలవంక చూశాకా తిరిగి దర్శించే మధ్యకాలం అంతా ముస్లింలకు పండుగే. అందుకే ఈ మాసంలో నిత్యం ముస్లిం వాడలు, మసీదులు సందడిగా ఉంటాయి. గ్రామీణ ప్రాంతాల్లోని మసీదులకు ప్రత్యేకంగా ఆధ్యాత్మిక శిక్షణ పొందిన మతగురువులను సైతం తీసుకువచ్చి అందరికీ రంజాన్ ప్రాధాన్యత, ఖురాన్ పఠనం, అల్లాహ్ ప్రపంచ మానవాళికి అందించిన దివ్య సందేశాలను బోధించడం జరుగుతుంది.

సూర్యచంద్రులే ఉపవాసదీక్షలకు ఆధారం..

ముస్లింలకు రంజాన్ మాసంలో రోజా(ఉపావాస) దీక్ష ఆరంభం, విరమణ, పండుగ నిర్వహణ తదితర అన్నింటికీ సూర్యచంద్రులే మార్గదర్శకం. నెలపొడుపు (చంద్రుడి)ని చూసి రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభిస్తారు. 30 రోజుల అనంతరం తిరిగి నెలవంకను చూసిన మరుసటి రోజు పండుగ పర్వదినాన్ని సంతోషంగా నిర్వహించుకుంటారు. అలాగే సూర్యోదయానికి ముందే సహరీ, సూర్యస్తమయం తర్వాతనే ఇఫ్తార్ ఆహారాన్ని స్వీకరిస్తారు. రోజా సమయంలో ఉదయం 4.10 నుంచి సాయంత్రం 7 గంటల వరకు నోటిలో ఊరే లాలాజలాన్ని సైతం మింగక కఠోర దీక్షను పాటిస్తారు.

దానధర్మాలు, ఇఫ్తార్ విందులు, సమాజసేవలు..

ఇక రంజాన్‌తో ముడిపడి ఉండే ఇంకో అంశం జకాత్ దాతృత గుణాన్ని పెంపొందించడమే దీని ప్రధాన ఉద్దేశం. తమ సంవత్సర సంపాదనను 2.5శాతం లెక్కగట్టి పేదముస్లింలకు పంచాలని ఖురాన్ చెబుతుంది. జకాత్ చెల్లించడం అనేది ముస్లింల అందరిపై ఉన్న బాధ్యత. పేదవారు కూడా అందరితో సంతోషంగా పండుగ జరుపుకొనేందుకు ఈ దానాలు ఉపయోగ పడతాయి. ఇఫ్తార్‌కి శరీర చలువ కోసం గంజి, శక్తికి స్వీట్లు, పండ్లు, ఫలాలు మసీదుల్లో పంపిణీ చేస్తారు.

రోజా అల్లాహ్ ప్రసాదించిన వరం...



రంజాన్ మాసంలో నరక ద్వారాలు మూసి.. స్వర్గద్వారాలు తెరుచుకుంటాయి. ఈ నెల రోజులు మానవుడు ప్రాపంచిక సంతోషాలను త్యజించి, తమలో ఆధ్యాత్మిక శక్తిని నింపుకొనే శిక్షణ కాలమిది. స్వయంగా అజ్ఞానపు చీకట్లను తెంచుకుని, వాస్తవ జ్ఞాన వెలుగు మార్గంలోకి మరలడానికి రోజా మానవులకు అల్లాహ్ ప్రసాదించిన వరం. త్రికరణశుద్ధిగా ఉండే ఉపవాస దీక్షతో ఆత్మప్రక్షాళన జరుగుతుంది. దానధర్మాలు, రోజా, నమాజ్, దువా, తరావీహ్‌లతో అనంత కరుణామయుడు అల్లాహ్‌ను ఆరాధించేందుకు, పుణ్యఫలాన్ని పొందేందుకు, స్వర్గలోక వారసులయ్యేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి. ఈనెలలో ఒక్క మంచిపని చేస్తే 70 రెట్ల పుణ్యఫలాన్ని దైవం ప్రసాదిస్తారు.

– హజరత్ పీర్ మహమ్మద్ ముక్తరుల్లాషా, ముస్లిం మతపెద్ద, పసుమర్రు

క్లుప్తంగా

బాలుడిపై లైంగిక దాడి కేసులో ఇద్దరి అరెస్ట్

పెదకాకాని: బాలుడిపై లైంగిక దాడికి పాల్పడిన ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. పెదకాకాని మండలంలోని అగతవరప్పాడు శివారు కాలనీలో ఈనెల 19వ తేదీన ఇద్దరు యువకులు లైంగిక దాడికి పాల్పడ్డారు. లైంగిక దాడిని ఫోన్‌లో చిత్రీకరించి పలువురి ఫోన్‌లకు వాట్సాప్ ద్వారా పంపించి పైశాచిక ఆనందం పొందడంతో పాటు జరిగిన ఘటన ఎవరికైనా చెబితే చంపుతామని కత్తితో బెదిరించారు. బాలుడి ద్వారా సమాచారం తెలుసుకున్న అతడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఈ కేసులో అదే ప్రాంతానికి చెందిన ఇద్దరు యువకులను అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరచినట్లు పెదకాకాని సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

ఉద్యోగం పేరుతో సొమ్ము స్వాహా

పెనమలూరు: ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికి మహిళ వద్ద గుర్తు తెలియని సైబర్ నేరగాళ్లు సొమ్ము స్వాహా చేయటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ ఆర్.గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు గౌరిశంకర్‌నగర్‌కు చెందిన గడ్డమంగు శాంతకుమారి గత కొద్ది సంవత్సరాల క్రితం బీటెక్ చదివి ప్రైవేటు కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. ఆమె మంచి ఉద్యోగ అన్వేషణలో భాగంగా షేన్ డాట్‌కామ్‌లో పేరు రిజిస్ట్రేషన్ చేసుకుంది. మార్చి 1వ తేదీన షేన్‌డాట్ కామ్ నుంచి మాట్లాడుతున్నామని ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని ప్రాసెసింగ్ చేయటానికి సొమ్ము చెల్లించాలని తెలిపారు. ఆ వ్యక్తి మాటలు నమ్మిన ఆమె రెండు విడతలుగా రూ.1,42,389 సొమ్ము బ్యాంకు ఖాతాకు బదిలీ చేసింది. ఆ తరువాత తాను సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయానని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

శోభకృత్‌లో రాష్ట్రం మరింత శోభాయమానం



గుంటూరులో నిర్వహించిన పంచాంగ శ్రవణానికి హాజరైన ఎమ్మెల్సీలు లేళ్ల, డొక్కా తదితరులు

పట్నంబజారు: శోభకృత్ నామ సంవత్సరంలో పేరుకు తగ్గట్టుగానే రాష్ట్రాన్ని మరింత సమగ్రాభివృద్ధితో శోభాయమానంగా, సస్యశ్యామలంగా తీర్చిదిద్దాలని అందుకోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తగినంత శక్తిని ప్రసాదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ప్రజలందరికీ ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి, ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. బృందావన్‌గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ అప్పిరెడ్డి కార్యాలయంలో బుధవారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ నోరి నరసింహమూర్తి చేసిన పంచాంగ శ్రవణం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ చేపట్టిన పనులన్నీ నిర్విఘ్నంగా, నిరంతరాయంగా అమలు జరగాలని, పేదరిక నిర్మూలనకు చేస్తున్న ప్రయత్నాలు సఫలీకృతం కావాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను గుర్తు చేస్తూ వచ్చిన ఈ ఉగాది పండుగ అందరి జీవితాల్లో ఎనలేని ఆనందం, ఐశ్వర్యం తీసుకురావాలని కోరుకుంటున్నామని చెప్పారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ వసంత ఆగమనంతో శోభకృత్ సకల శుభాలను చేకూర్చాలని ఆకాంక్షించారు. ఉగాది వేడుకలలో డెప్యూటీ మేయర్లు వనమా బాలవజ్రబాబు, షేక్ సజీల, మిర్చియార్డు చైర్మన్ మద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, గీతా మందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ, పార్టీ నేతలు బందా రవీంద్రనాథ్, గులాం రసూల్, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, జిల్లా అధ్యక్షుడు వినోద్ పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు ప్రజల ఆశీస్సులు ఉండాలి

- ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి
- మాచర్లలో పంచాంగ శ్రవణం



పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ పీఆర్కే, పీవీఆర్

మాచర్ల: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల ఆశీస్సులు ఎల్లకాలం ఉండాలని కోరుతూ పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే), యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి పట్టణంలోని కోదండ రామాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉగాది పండుగ పురస్కరించుకొని పంచాంగ శ్రవణం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది పంచాంగ శ్రవణ కార్యక్రమంలో పాల్గొనగా వారికి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పీఆర్కే మాట్లాడుతూ ప్రజల ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ తురక కిషోర్, వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కౌన్సిలర్ పోలా శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనివాసశర్మ, జూలకంటి వీరారెడ్డి, చిల్లంచర్ల సత్యనారాయణ, కొత్తమాసు బ్రహ్మారావు, తిరివీధి వెంకట నాగేశ్వరరావు, మేడం శివరామకృష్ణ, కంభంపాటి ప్రకాశరావు, మేడం శ్రీనివాసరావు, విడేల సుందరరావు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పంచాంగ శ్రవణం

అమరావతి: శోభకృత్ నామ సంవత్సరాన్ని భక్తిశ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా చేపట్టారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతి అమరేశ్వరునికి వేకువజామున మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి సహస్ర కుంకుమార్చనను నిర్వహించారు. దేవాలయ ఈఓ కె.సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో వెంకటాద్రినాయుడు మండపంలో స్వామిని ఉంచి శోభకృత్ నామసంవత్సర పంచాంగాలకు పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ అర్చకులు పంచాంగ శ్రవణం చేశారు. అలాగే అమరావతి రామకృష్ణ అన్నసత్రంలో, మెయిన్‌బజారులో కోదండరామాలయం, పాండురంగస్వామి దేవస్థానం, హనుమత్ గీతామందిరం, మల్లాది వెంకటేశ్వరస్వామి దేవస్థానం, వైకుంఠపురం వెంకటేశ్వర స్వామి దేవస్థానాలలో పంచాంగ శ్రవణం చేశారు.



అమరేశ్వరుని సన్నిధిలో ఉగాది పంచాంగ శ్రవణం చేస్తున్న పండితులు

అత్తింటి వేధింపులకు వివాహిత మృతి



సహజ (ఫైల్)

పెనమలూరు: అత్తింటి వేధింపులకు వివాహిత తనువు చాలించింది. తమ కుమార్తె మరణానికి అత్తింటివారే కారణమని మృతురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయటంతో పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఆర్.గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్ మేడ్చల్ జిల్లా మేడిపల్లికి చెందిన మననం వేణు ప్రైవేటు లెక్చరర్‌గా పని చేస్తారు. ఆయన కుమార్తె సహజ (26)ను తాడిగడప మున్సిపాలిటీ కానూరు సనత్‌నగర్‌కు చెందిన బిట్రా ఉమాకాంత్‌కు ఇచ్చి 2020లో వివాహం చేశారు. పెళ్లి సమయంలో కట్నకానుకలు ఇచ్చారు. వీరికి ఓ కుమార్తె ఉంది. అదనపుకట్నం తీసుకురమ్మని సహజను భర్త ఉమాకాంత్‌తో పాటే అత్త నక్కుబాయ్, ఆడపడుచు ఉడతా కిరణ్మయి వేధించసాగారు. ఈ విషయమై సహజ తల్లిదండ్రులు వచ్చి అత్తింటివారికి అనేక సార్లు నచ్చచెప్పారు. అయినా వ్యవహారంలో మార్పురాలేదు. మంగళవారం సహజను భర్త ఉమాకాంత్ వేధింపులకు గురి చేశాడు. భర్త తనను ఇబ్బందులు పెడుతున్నాడని సహజ తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పింది. ఆ తరువాత సహజ గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని మృతి చెందింది.

అత్తింటివారే హతమార్చారు...

కాగా తహసీల్దార్ టీవీ సతీష్ బుధవారం శవపంచనామా చేయగా మృతురాలి కటుంబ సభ్యులు అత్తింటివారి పై తీవ్ర ఆరోపణలు చేశారు. తమ కుమార్తె సహజను అత్తింటివారే చంపి ఉరివేశారని ఆరోపించారు. ఈ ఘటనకు భర్త, అత్త, ఆడపడుచే కారణమని వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- వాగ్దేవి పుత్ర వాగ్భూషణ డాక్టర్ నందనవనం శ్రీనివాసరావు జోస్యం
- బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా ఉగాది వేడుకలు



పంచాంగ శ్రవణం చేస్తున్న నందనవనం శ్రీనివాసరావు, వేదికపై అంబటి మురళీకృష్ణ

కొరిటెపాడు(గుంటూరు): శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలను బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పొన్నూరు మండలం, మామిళ్లపల్లిలోని శ్రీ పెద్దేటమ్మ తల్లి పీఠం ఆవరణలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాగ్దేవి పుత్ర వాగ్భూషణ డాక్టర్ నందనవనం శ్రీనివాసరావు పంచాంగ శ్రవణం చేశారు. 2024లో ఎన్నికల్లో తిరిగి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భారీ మెజార్టీతో ప్రమాణ స్వీకారం చేస్తారని వెల్లడించారు. రానున్న ఏడాదిలో గ్రహ గమనం, తత్ ఫలితంగా ఆయా రాశుల వారికి సంక్రమించే ఫలితాలను, ఫలాలను తనదైన శైలిలో సామాన్యులకు అర్థం అయ్యేలా వివరించారు. ఈ ప్రభుత్వంలో రాబోయే ఏడాదిలో రాష్ట్ర ప్రజలు మరిన్ని సత్ఫలితాలు పొందుతారని, ఆనందోత్సాహాలతో ఉంటారని జోస్యం చెప్పారు. అనంతరం బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ దైనందిన జీవితంలో ప్రతి ఒక్క భావోద్వేగానికి తనదైన ప్రత్యేకత ఉందని చెప్పారు. వీటిని సక్రమంగా అర్థం చేసుకుని సంయమనం పాటించినప్పుడే జీవితం పరిపూర్ణమవుతుందనే సందేశం తెలుగు సంవత్సరాది 'ఉగాది' లో నిగూఢమై ఉందని పేర్కొన్నారు. నూతన సంవత్సర తొలిరోజు షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిని ప్రసాదంగా తీసుకోవడం జీవితంలో ఎదురయ్యే అన్ని రకాల పరిస్థితులకు ప్రతీకగా నిలుస్తోందన్నారు. తెలుగువారి సంప్రదాయానికి, సంస్కృతికి కొనసాగింపుగా ఉన్న మన పండుగలను, విశిష్టతను వాటి ప్రాశస్త్యాన్ని భావితరాలకు కూడా తెలియజేసే సదుద్దేశంతో బజరంగ్ ఫౌండేషన్ ఈ ఉగాది వేడుకలను పెద్ద ఎత్తున జరుపుతుందని తెలిపారు. పంచాంగ శ్రవణంలో ప్రజలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ పెద్దేటమ్మ తల్లికి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు, నిర్వహించి మంగళ హారతులు సమర్పించారు. అనంతరం ఉగాది పచ్చడిని, అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంచాంగాలను పంపిణీ చేశారు.

నిధులు గోల్‌మాల్ పై కదిలిన యంత్రాంగం

- విచారణకు ఆదేశించిన డీపీవో
- బిల్లు కలెక్టర్ సస్పెన్షన్



పెనమలూరు గ్రామపంచాయతీ

పెనమలూరు: పెనమలూరు గ్రామ పంచాయతీలో నిధులు స్వాహా చేసిన ఘటన పై ఉన్నతాధికారులు ఎట్టకేలకు స్పందించి చర్యలు చేపట్టారు. నిధులు స్వాహా చేసిన మాజీ బిల్లు కలెక్టర్, ప్రస్తుత చోడవరం బిల్లు కలెక్టర్‌గా పని చేస్తున్న షేక్.షంషుద్దీన్‌ను సస్పెన్షన్ చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఎస్‌వీ నాగేశ్వర్ నాయక్ ఉత్తర్వులు ఇచ్చారు. మాజీ బిల్లు కలెక్టర్ షేక్.షంషుద్దీన్ గ్రామ పంచాయతీలో ఇంటి పన్నులు, నీటి పన్నులు రూ.47,03,953 లక్షలు స్వాహా చేశాడని పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణ ఫిర్యాదు చేశారు. పెనమలూరులో పని చేసిన కాలంలో అనేక అక్రమాలకు పాల్పడినట్లు అధికారుల ప్రాథమిక విచారణలో తేలింది.

ఇంతకాలం ఏమి చేశారు ?

కాగా బిల్లు కలెక్టర్ పెనమలూరు గ్రామ పంచాయతీలో చాలా సంవత్సరాలుగా తిష్ట వేసి ప్రజాధనాన్ని దోచుకున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. కనీసం అతను బదిలీ పై చోడవరం వెళ్లిన సమయంలోనైనా రికార్డులు స్వాధీనం చేసుకోకుండా ఎలా రిలీవ్ చేశారనేది పెద్ద ప్రశ్నగా ఉంది. ఈ తంతగం వెనుక ఎవరు ఉన్నారనేది విచారణలో నిగ్గు తేల్చాల్సి ఉంది. పైగా ఆయన చోడవరంలో ఉండకుండా వేరే ప్రాంతంలో ఉన్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడు షంషుద్దీన్ కుటుంబ సభ్యులతో సహా పరార్ అయిన తరువాత ఆలస్యంగా అధికారులు కళ్లు తెరిచారు.

నిధులు రికవరీ చేస్తారా..?

బిల్లు కలెక్టర్ ఏకంగా రూ.47 లక్షల ప్రజాధనాన్ని స్వాహా చేయటంతో ఇకనైనా అధికారులు సొమ్ము రికవరీ చేస్తారా లేదా అని స్థానికుల చర్చించుకుంటున్నారు. గత టీడీపీ పాలనలో యనమలకుదురు గ్రామ పంచాయతీలో రూ.లక్షల నిధులు దుర్వినియోగం జరిగినా నేటికి రికవరీ జరగలేదు. ప్రజాధనం చేతులు మారిపోయింది. ఇప్పుడు పెనమలూరులో జరిగిన ఘటన పై సొమ్ము రికవరీ చేసి క్రిమినల్ కేసు పెడతారా లేదా వేచి చూడాల్సి ఉంది.

విచారణ అధికారిగా డీఎల్‌పీవో...

పెనమలూరు ఘటన పై విచారణ అధికారిగా గుడివాడ డీఎల్‌పీవోను వేశానని డీపీవో నాగేశ్వర్‌నాయక్ తెలిపారు. విచారణ అనంతరం చర్యలు ఉంటాయన్నారు.

భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య

హనుమాన్‌జంక్షన్ రూరల్: చెడు వ్యసనాలకు బానిసైన భర్త వేధింపులు తాళలేక బాపులపాడు మండలం వీరవల్లిలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. శాలివాహన కాలనీకి చెందిన మౌనికకు ఉంగుటూరు మండలం తేలప్రోలుకు చెందిన గరిక జోజిబాబు అనే వ్యక్తితో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వీరికి రెండేళ్ల వయస్సు కలిగిన పాప ఉంది. పందుల పెంపకం ద్వారా జీవనం సాగించే జోజిబాబు గతకొద్దికాలంగా మద్యానికి బానిసగా మారాడు. కట్టడి చేయాలని ప్రయత్నించిన భార్య మౌనిక (22)ను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేశాడు. దీంతో పలుమార్లు ఇద్దరి మధ్య మనస్పర్థలు పెరిగి వివాదానికి దారితీశాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం వీరు నివసిస్తున్న ఇంట్లో మంగళవారం రాత్రి వీరిద్దరి మధ్య గొడవ చోటు చేసుకుంది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన మౌనిక చీరతో ఉరి పోసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కొద్దిసేపటికి గుర్తించిన కుటుంబ సభ్యులు, స్థానికులు ఆమెను రక్షించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అప్పటికే మౌనిక మృతి చెందటంతో వీరవల్లి పోలీసుకుల సమాచారం అందించారు. గన్నవరం ప్రభుత్వాసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్ఐ చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సామాజిక సేవకులు ఏకాదండయ్య పంతులు

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి



కృష్ణారావు, రాజ్యలక్ష్మి దంపతులను సత్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: సామాజిక సేవా పరాయణులు ఏకాదండయ్య పంతులు అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి అన్నారు. బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో ఏకాదండయ్య పంతులు చారిటీస్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు రాళ్లబండి సత్యనారాయణ పంచాంగ శ్రవణం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పార్థసారథి మాట్లాడుతూ 183 ఏళ్ల క్రితం గుంటూరు నగరంలో జన్మించిన ఏకాదండయ్య పంతులు తన వీలునామా ద్వారా విద్య, వసతి గృహాలు, ధార్మిక, సమాజహిత కార్యక్రమాల కోసం కోట్లాది రూపాయల ఆస్తులు అందించిన మహానుభావుడని కొనియాడారు. గుంటూరు నగరం, జిల్లా గర్వించదగ్గ సంఘసేవ పరాయణులుగా పేర్కొనవచ్చునని అన్నారు. ఛారిటీస్ మేనేజింగ్ ట్రస్టీ కోటంరాజు శేష చంద్రమౌళీశ్వరరావు మాట్లాడుతూ ఏకాదండయ్య పంతులు తన ప్రధాన వీలునామాలో పేర్కొన్న విధంగా ప్రతి ఏడాది ఉగాది ఉత్సవాలు, ప్రముఖులను ఆయన పేరున సత్కరించడం జరుగుతోందని వివరించారు. ఈ సందర్భంగా దశాబ్దాలుగా చారిటీస్‌కు సేవలందిస్తున్న ప్రముఖ న్యాయవాది కొండూరి కృష్ణారావు, రాజ్యలక్ష్మి దంపతులను ఆత్మీయ అతిథులు, ట్రస్టీల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి, న్యాయవాది జూపూడి రంగరాజు, డాక్టర్ దీవి హరిప్రసాద్, ట్రస్టీలు కేఎస్ఆర్ కుటుంబరావు, కొండూరి నంద కిషోర్, భట్రాజు కృష్ణ కిషోర్, కేసానుపల్లి శ్రీరామసుబ్బారావు, నెప్పల్లి వరప్రసాద్ పాల్గొన్నారు.

ఐఐటీలో ఆలిండియా ర్యాంక్

జగ్గయ్యపేటఅర్బన్: దేశ వ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఐఐటీ–జేఏఎం 2023 ఫలితాల్లో పేటలోని జేఆర్సీ–విశ్వభారతి డిగ్రీ కళాశాల విద్యార్థిని జింకల గీత ఆలిండియా ర్యాంక్ (794) సాధించింది. ఈ సందర్భంగా బుధవారం జేఆర్సీ కళాశాల చైర్మన్ రంగాపురం నరసింహారావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పెనుగొండ రాజీవ్ గీతను అభినందించారు. షేర్‌మహ్మద్‌పేటలోని జింకల నరసింహారావు, విజయలక్ష్మి దంపతుల కుమార్తె గీత గౌహతి ఐఐటీలో కెమిస్ట్రీ విభాగంలో ఎమ్మెస్సీ చదివేందుకు అర్హత సాధించింది. కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్ రమేష్, వైస్ ప్రిన్సిపాల్ జె.తిరుపతిరావు, అబ్బులు, నారాయణరావు తదితరులు గీతకు అభినందనలు తెలిపారు.